

నేడు యథావిధిగా 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'

ప్రజాశక్తి-రాయచోటి
ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం రాయచోటి తో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమ స్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి

- ఫీజుల వేధింపులపై రక్షణ కల్పించాలి
- మహతి ఫార్మశీ కళాశాల అటానమస్ హోదాను రద్దు చేయాలి
- ఎస్ఎఫ్ఐ డిమాండ్



మహతి ఫార్మసీ కళాశాల వద్ద నిరసన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్
పట్టణంలో మహతి కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపల్ నుంచి విద్యార్థులకు నిత్యం ఎదురవుతున్న ఫీజులు వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం కళాశాల ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ మాట్లాడుతూ కళాశాల యాజమాన్యం రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కంటే అధికంగా వసూలు చేస్తూ విద్యార్థులను ఫీజుల పేరుతో మానసికంగా వేధిస్తున్నారన్నారు. మహతి కళాశాలలో అనేక మంది విద్యార్థులు ఫీజులు వేధింపు భరించలేక మధ్యలోనే చదువులు మానేశారన్నారు. ఆ విద్యార్థులు తమ సర్టిఫికెట్లు కోసం కాలేజకు వెళ్తే 4ఏళ్ల ఫార్మశీ ఫీజు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని యాజమాన్యం చెప్పుడంతో అనేక మంది విద్యార్థులు సర్టిఫికెట్లను కళాశాలలోనే వదిలేసిన పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం ఫీజు రీఎంబర్స్‌మెంట్‌ను దశల వారీగా కళాశాల ప్రిన్సిపల్ అకౌంట్‌కి జమ చేస్తోందని చెబుతున్నా, కలెక్టర్, విద్యాశాఖాధికారులు ఆదేశాలు ఇచ్చినప్పటికీ కళాశాల యాజమాన్యం మాత్రం నిబంధనలకు వ్యతిరేకంగా విద్యార్థులను వేధింపులకు గురి చేస్తోందని అన్నారు. ఫీజుల వేధింపులకు తాళలేక నేనింకా ఆ కళాశాలలో చదవను, ఫీజులు ఒత్తిడి ఎక్కువైందంటూ విద్యార్థి స్వయంగా రాసిన సూసైడ్ నోట్‌లో ఉందన్నారు. తక్షణమే మహతి ఫార్మశీ కళాశాల అటానమస్ హోదాను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అటానమస్ హోదాకు కావాల్సిన వసతులు, ల్యాబ్స్, అర్హత కలిగిన ఫ్యాకల్టీస్ కూడా ఆ కళాశాలలో లేరన్నారు. యూనివర్సిటీ గ్రాండ్ కమిషన్‌కు మహతి కళాశాల యాజమాన్యం తప్పుడు రికార్డులు చూపించి దొడ్డి దారిన అటానమస్ హోదా, నాక్ ఎ గ్రేడ్ తెచ్చుకుందని అన్నారు. ఒకే క్యాంపస్ లోనే కాలేజీ, బాలికల హాస్టల్ నిర్వహించడం యూనివర్సిటీ నిబంధనలకే పూర్తి విరుద్ధమన్నారు. యూనివర్సిటీ గ్రాండ్ కమిషన్ (యుజిసి) న్యూఢిల్లీ స్పందించి మహతి కళాశాలకు ఇచ్చిన అటానమస్ హోదా, నాక్ ఎ గ్రేడ్ పైన సమగ్ర విచారణ జరిపించి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ లో ఉన్న రూ.8 వేల కోట్ల ఫీజు రీఇంబర్స్ మెంట్ ను విడుదల చేసి విద్యార్థులకు కళాశాల యాజమాన్యాల నుండి ఫీజు వేధింపులను ఆపాలన్నారు. మహతి కళాశాల యాజమాన్యం వేధింపుల పై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించి సమగ్ర విచారణ జరిపి, ఆ కళాశాల పై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.నిరసన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆఫ్రిద్, జిల్లా కమిటీ సభ్యులు జయబాబు, సమీర్, సుల్తాన్, బన్నీ , శివాజీ పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు

జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డి. నాగార్జున



ముఖా ముఖి..

ప్రజాశక్తి-రాయచోటి
జిల్లాలో నిరుద్యోగ యువతకు అందుబాటులో ఉండి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి దాసరి నాగార్జున పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో నిరుద్యోగ యువతపై ప్రత్యేక శ్రద్ధ వహించి నైపుణ్యం పెంపొందించడం, ఉచితంగా శిక్షణ కల్పించడం, జాబ్ మేళాలో యువతకు ఉద్యోగ అవకాశాలు ఎలా పొందాలో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖా ముఖిలో ఆయన వివరించారు.

జిల్లా నైపుణ్యాధి సంస్థ పని వివరాలు తెలియజేయండి?
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, ఉపాధి కార్యాలయం ద్వారా జిల్లాలోని అన్ని నియోజకవర్గంలలో ప్రతి 3 నెలలకు ఒకసారి జాబ్ మేళా (2 లేదా 3 కంపెనీలతో) నిర్వహించి జిల్లాల్లోని నిరుద్యోగ యువతకు ప్రయివేటు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. జిల్లా వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో ఒక స్కిల్ హబ్ ద్వారా 30 మంది నిరుద్యోగ యువతకు 3 నెలల పాటు ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

నిరుద్యోగ యువతకు శిక్షణ ఎక్కడ ఇస్తారు?
నిరుద్యోగ యువతకు జిల్లా వ్యాప్తంగా రాయచోటిలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, మదనపల్లిలో జిఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల, రాజంపేటలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఎన్ సి కళాశాల, పీలేరులో ఎస్‌జి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రైల్వే కోడూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తంబళ్లపల్లెలో ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో నిరుద్యోగ యువతకు శిక్షణ ఇస్తాం.

ఎలాంటి శిక్షణ ఇస్తున్నారు?
నిరుద్యోగ యువతకు జిల్లా నైపుణ్య అభివృద్ధి ద్వారా జిల్లాలోని అన్ని నియోజక వర్గాల్లో జాబ్ మేళా నిర్వహిస్తాం. శిక్షణ సమయంలో భోజనం వసతులు ఉంటుంది. శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు కల్పిస్తాం.

శిక్షణ ఎవరి చేత అందిస్తారు?ఎక్కడ ఇస్తారు?
ఎపిఎస్ఎస్‌డిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యం అభివృద్ధి సంస్థ ట్రైనర్లు, న్యాక్, ఫ్రీ లాన్సర్లు ద్వారా శిక్షణ ఇస్తాం. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో ప్రభుత్వ ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలలో శిక్షణ ఇప్పిస్తాం.

జిల్లాలో సిబ్బంది కొరత ఏమైనా ఉందా?
జిల్లా నైపుణ్య సంస్థ కార్యాలయంలో గతంలో సిబ్బంది కొరత ఉండేది. ప్రస్తుతం ఎటువంటి సిబ్బంది కొరత లేదు.

నిరుద్యోగ యువతకు ఏమైనా సలహాలు ఇవ్వాలనుకుంటున్నారా?
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, ఉపాధి కార్యాలయం ద్వారా జిల్లాలో నిర్వహించే జాబ్ మేళాలను యువత సద్వినియోగం చేసుకోవాలి. స్కిల్ హబ్‌లలో ఇచ్చే శిక్షణ కార్యక్రమాలు నిరుద్యోగుల భవిష్యత్‌ను నిర్దేశిస్తుంది. నైపుణ్య అభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ పొందిన వారికి స్కిల్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం పేరుతో విదేశ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాం. మరిన్ని వివరాలు కోసం Facebook: APSS-DC-Annamayya District,Instagram: apssdc_anmy, APSSDC టోల్ ఫ్రీ నెంబర్ : 9988853335లో సంప్రదించవచ్చు.

ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలి : యుటిఎఫ్



మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు హరిప్రసాద్

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్
ఉద్యోగ ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని వైవి నాగిరెడ్డి డిగ్రీ కళాశాలలో యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తమది స్నేహపూర్వక ప్రభుత్వ మని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లిస్తామని అన్నారు. పిఆర్‌సిని వెంటనే అమలు చేస్తామని ప్రగల్భాలు పలికి ఇప్పటికి సంవత్సరం గడిచినా ప్రయోజనం లేకుండా పోతోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో 57 ప్రకారం 2003 డిఎస్‌సి వారిని పాత పెన్షన్ విధానంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉపాధ్యాయులను బోధనేతర పనులకు ఉపయోగించుకోబోమని ఒకవైపు చెబుతూనే మరొక వైపు రకరకాల యాప్ లతో, వివిధ రకాల శిక్షణలు మరియు ఇతరత్రా కార్యక్రమాలతో ఉపాధ్యాయులను మానసిక క్షోభకు గురి చేస్తున్నదన్నారు. ఉపాధ్యాయ సంఘాల అనేక పోరాటాలతో ఉపాధ్యాయ బదిలీలు ముగిసినప్పటికీ రిలీవర్ లేక ఎక్కడి వాళ్లు అక్కడే ఆగిపోవడంతో ఉపాధ్యాయుల్లో నిరాశ, ఆందోళన నెలకొందని అన్నారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయుటకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. డిఎస్‌సి ఉపాధ్యాయుల నియామకం తర్వాత బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చెయ్యాలనుకుంటే డిఎస్‌సి ఉపాధ్యాయుల సంఖ్యను పెంచితే తప్పా సాధ్యం కాదన్నారు. ఈ సమస్యలు పరిష్కరించుటకు వెంటనే చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఉద్యమ కార్యాచరణ చేసి పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షులు సుధాకర్ నాయుడు జిల్లా సహాధ్యక్షులు శివారెడ్డి, హేమలత, జిల్లా కోశాధికారి బి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శులు పి.వెంకట సుబ్బయ్య, వై.శ్రీధర్ రెడ్డి, రమణ మూర్తి, పురం వెంకటరమణ, దావుద్దీన్, భాస్కర్ రెడ్డి, ఆదినారాయణ, రాష్ట్ర కౌన్సిలర్లు డి.చెంగల్ రాజు, శివారెడ్డి, ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుల రాష్ట్ర సబ్ కమిటీ కన్వీనర్ చంద్ర శేఖర్, జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ సాదిఖ్ ఖాన్, ప్రచురణ విభాగం కన్వీనర్ విజయ్ కుమార్, ఆడిట్ కమిటీ కన్వీనర్ సురేంద్ర రెడ్డి, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ప్రసాద్, అజ్మతుల్లా, వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.


సంఘీభావం తెలియజేస్తున్న నాయకులు

ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోవాలి

- కార్మిక సంఘాల సదస్సులో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రామాంజులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్
కార్మికులు సాధించుకున్న చట్టాలను, హక్కులను బిజెపి ప్రభుత్వం కాలరాస్తుందని, జూలై 9న కేంద్ర కార్మి సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న దేశ వ్యాప్త సమ్మె లో కార్మిక, కర్షక శ్రేణులు పాల్గొని సమ్మె జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రామాంజులు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక, విధానాలను వ్యతిరేకిస్తూ కార్మికులను సంఘటితం చేయడానికి మండలకేంద్రంలోని సిఐటియు కార్యాలయంలో మండల కన్వీనర్ డి.భాగ్యలక్ష్మి అధ్యక్షతన కరపత్రాలను వివిధ కార్మిక సంఘాల నాయకులు విడుదల చేశారు. అనంతరం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎవి.రమణ, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.వి. రమణ మాట్లాడుతూ కార్మికులు ప్రాణ త్యాగాలతో పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి బడా కంపెనీల యజమానులకు అనుకూలంగా చట్టాలను మారుస్తున్నారని చెప్పారు. కార్మికుల శ్రమ దోపిడీని దోచుకు తినే విధంగా చట్టాలను మారుస్తున్నారని పేర్కొన్నారు. ఇది ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని తెలిపారు. విద్యుత్ శాఖలో పెండింగ్‌లో ఉన్న 4 డిఎలను విడుదల చేయాలి, ఇపిఎఫ్ నుంచి జిపిఎఫ్‌కు బదిలీ చేయాలన్నారు. 2014 నుండి కోర్టు పెండింగ్‌లో ఉన్న జెఎల్ఎం గ్రేడ్ – 2 జెఎల్ఎంకు ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. . రిటైర్డ్ అయినా ఉద్యోగులకు ఇపిఎఫ్, మెడికల్ సౌకర్యం కల్పించాలన్నారు. కేంద్రం జీతాలు పెంచకుండా 12 గంటలు, పెంచి, రాష్ట్ర ప్రభుత్వం 10 గంటల పని దినాలు పెంచి శ్రమ దోపిడీ చేస్తున్నాయన్నారు. కార్మికులకు పోరాడే హక్కు లేకుండా చేయడానికి కుట్ర పన్నుతున్నారని చెప్పారు. కుట్రలను కార్మిక వర్గం ఐక్యంగా పోరాటాల ద్వారా తిప్పికొట్టాలన్నారు. 9న దేశవ్యాప్తంగా నిర్వహించే సమ్మెలో, ఉద్యోగులు పాల్గొని సంఘీభావం తెలపాలని అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు సిద్దమ్మ మంజుల, బీడీ సంఘం నసీబ్ జాన్, ఆశా నాయకులు సునీత, శైలజ, మధ్యాహ్న భోజన కార్మికులు జయన్న ఫర్హానా, హమాలీ నాయకులు మాధవ, రత్నం, మున్సిపల్ నాయకులు అక్బర్, నాగేశ్వర నాయుడు, ఈశ్వర్ రెడ్డి, గ్రామ పంచాయతీ నాయకులు దేవరాయలు వెంకటరమణ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్
2024 శాసనసభ ఎన్నికల ఫలితాల్లో కూటమి అభ్యర్థులు 164 స్థానాల్లో విజయం సాధించి చరిత్ర సృష్టించారని, అదేస్ఫూర్తితో త్వరలో జరగబోవు సంస్థాగత ఎన్నికలలో సత్తా చాటుదామని మదనపల్లె సంస్థాగత పరిశీలకులు మల్లికార్జున రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం 14వ వార్డు ఎన్నికల పరిశీలన నిమిత్తం వచ్చిన ఆయనకు స్థానిక టిడిపి నాయకులు నాగూర్ వలి , సీనియర్ నాయకులు పచ్చిపాల రామకృష్ణ ఆచారిలు శాలువ, పూలమాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ యేడాది కూటమి పాలన అద్భుతంగా సాగుతోందని అన్నారు. సూపర్ సిక్స్ సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటికి లబ్ధి చేకూరుతోందని అన్నారు. ఎమ్మెల్యే షాజహాన్ బాషా నేతృత్వంలో కూటమి నాయకులు కలిసికట్టుగా క్లీన్ స్వీప్ చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అంగడి కుమార్, లోకేష్ రాజేష్, వాసు, రవి, చలపతి సుజాత, రత్నమ్మ, ఖాదర్ బాషా, పతి, గౌతమి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అమూల్యమైనవి : మంత్రి

ప్రజాశక్తి - రాయచోటి
పట్టణంలోని లయన్స్ క్లబ్ అందిస్తున్న సేవలు అమూల్యమైనవని రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పిసిఆర్ గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లా డారు. లయన్స్ క్లబ్ వారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున సహాయసహకారాలు అందిస్తామని తెలిపారు .అనంతరం పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్స్ లయన్ యం.గౌతమ్, లయన్ కె.చిన్నప్పరెడ్డి, లయన్ యం.సుధాకర్ రెడ్డి,లయన్ జె.చంద్రప్రకాష్ రావ్, డాక్టర్ కె. బయారెడ్డి, డాక్టర్ పి.నారాయణ రెడ్డి, మానవతా జిల్లాధ్యక్షుడు ఎ.శివగంగిరెడ్డి మాట్లాడుతూ రాయచోటి లయన్స్‌క్లబ్ నాలుగు జిల్లాల్లో మొదటి స్థానంలో సేవ కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. గత అధ్యక్షుడు లయన్ పి.శివారెడ్డి ఆధ్వర్యంలో 460 కార్యక్రమాలు చేయడం చాలా గొప్ప విషయమని చెప్పారు. రాబోయే రోజులలో కూడా నూతన అధ్యక్షులు లయన్ శ్యామ్ కూడా ఇంకా మంచి కార్యక్రమాలు చేసి రాయచోటి ప్రజల మన్ననలు పొందాలని తెలియజేశారు.
ఈ సంవత్సరం రాయచోటి ప్రజలకు తన వంతు శక్తివంచన లేకుండా పేద ప్రజలకు సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. అనంతరం పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ యం.సుధాకర్ రెడ్డి , అధ్యక్షులుగా లయన్ పి.శ్యామ్, కార్యదర్శిగా లయన్ షేక్ ఇందాద్ అహమ్మద్, కోశాధికారిగా లయం. కె.మనోహర్ రాజు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ క్విస్ట్ చైర్మన్ లయన్ పి.ఎస్.హరినాథ్ రెడ్డి, రీజినల్ చైర్మన్ లయన్ షేక్ మహమ్మద్ ,జోన్ చైర్మన్ లయన్ వెంకట సుబ్బయ్య, లయన్స్ సభ్యులు పాల్గొన్నారు.

రెవెన్యూ శాఖలోని సమస్యలకు త్వరలో పరిష్కారం : మంత్రి

రెవెన్యూ శాఖలోని సమస్యలకు త్వరలో పరిష్కారం లభిస్తుందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. తన క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి వచ్చిన అధికారులు, ప్రజల ఇచ్చిన అర్జీలు స్వీకరించి, వారి సమస్యలకు తక్షణమే పరిష్కార మార్గాలను సూచించారు.

మిట్స్‌కు జాతీయస్థాయి ట్రిపుల్ ఎ రేటింగ్

ప్రజాశక్తి-మదనపల్లె : అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు జాతీయ స్థాయి టాప్ 20 కళాశాలగా ట్రిపుట్ రేటింగ్ లభించిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. జాతీయ స్థాయిలో ఎన్‌పిటిఇఎల్ వారు ఆన్‌లైన్‌లో జనవరి – ఏప్రిల్ 2025 సెషన్‌లో నిర్వహించిన పరీక్షలలో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు మొత్తం 7108 సర్టిఫికెట్ కోర్సులకు హాజరు కాగా అందులో 5747 ప్రతిభ కనపరిచి జాతీయ స్థాయిలో ఎన్‌పిటిఇఎల్ సర్టిఫికెట్‌ను పొందడమే కాక, 200 మందికి గోల్డ్ రేటింగ్, సిల్వర్ 1191, ఎలైట్ 2419కి లభించిందని అన్నారు. కళాశాలకు ట్రిపుల్ ఎ రేటింగ్ తో పాటు టాప్ 20లో మిట్స్ కళాశాల 13వ ర్యాంక్‌గా గుర్తింపును అందించినట్లు ఆయన అన్నారు. చెన్నై లోని ఐఐటిమద్రాస్‌లో జరిగిన అవార్డుల కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.పృథ్వీరాజన్ అవార్డు అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ అన్నారు.ఈ గుర్తింపుకు కృషి చేసిన విద్యార్థులు, అధ్యాపకులు చేసిన కృషికి కలశాల కరెస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల విద్యార్థులు, అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.


సర్టిఫికెట్లు అందుకుంటున్న విద్యార్థులు

అదృశ్యమైన విద్యార్థిని ఆచూకీ లభ్యం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్
ఫీజుల వేధింపులు ఎక్కువయ్యాయి, ఇక ఆ కాలేజీలో చదువుకోవడం ఇష్టం లేదు.. నాకు చావే శరణ్యమంటూ అదృశ్యమైన మహతి ఫార్మసీ కాలేజ్ విద్యార్థిని ఆచూకి లభ్యమైంది. కేసు నమోదు చేసిన తాలూకా ఎస్ఐ గాయత్రి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి తిరుమలలో ఉన్నట్లు గుర్తించి అక్కడి పోలీసుల సాయంతో గంటల వ్యవధిలో విద్యార్థిని పట్టుకున్నారు. ఆదివారం విద్యార్థిని శ్వేతశ్రీచంద్ర ను తాలూకా పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి తల్లిదండ్రులు సూర్యనారాయణ, సుజాతకు అప్పగించారు. ఈ సందర్భంగా విద్యార్థినిని విచారించగా కళాశాలలో ఫీజులంటూ అందరి మధ్యలో నిలబెట్టడంతో తీవ్ర అవమానానికి గురయ్యానని, ఆ కాలేజీలో చదవనని చెబితే తల్లిదండ్రులు ఒప్పుకోవడం లేదని అన్నారు. ఎక్కువ ఒత్తిడికి లోనై ఇంటి నుంచి వెళ్లిపోవాలని నిశ్చయించుకుని ఇలా చేశానని చెప్పినట్లు తెలిపారు. సిఐ కళా వెంకటరమణ, ఎస్ఐ గాయత్రి విద్యార్థినికి కౌన్సెలింగ్ ఇచ్చారు. తల్లిదండ్రులకు సైతం కౌన్సెలింగ్ ఇచ్చి ఇష్టం లేని చదువు వద్దని, చదవగలిగే కోర్సులోనే జాయిన్ చేయించాలన్నారు. కళాశాల లో ఫీజుల వేధింపుల పై విచారణ చేసి రుజువైతే చర్యల కోసం విద్యాశాఖాధికారులకు రెఫర్ చేస్తామని తెలిపారు.


అదృశ్యమైన విద్యార్థినిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్ఐ గాయత్రి

హంస వాహనంపై సౌమ్యనాథుడు

ప్రజాశక్తి - నందలూరు
ఉమ్మడి కడప జిల్లాలో చారిత్రాత్మక ప్రసిద్ధి చెందిన నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజు ఆదివారం ఉదయం పల్లకి సేవ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు సునీల్ కుమార్, పాంచరాత్ర ఆగమ పండితులు రఘునందన్, పవన్ కుమార్, మనోజ్ కుమార్, సాయి స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ సౌమ్యనాథుడు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి హంస వాహనంపై సరస్వతీ దేవి అలంకారంలో శ్రీ సౌమ్యనాథుడు శ్రీదేవి భూదేవితో కలిసి మాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ హనుమంతప్ప, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్ కుమార్, విజిలెన్స్ అధికారి శేషాచలం, భక్తులు పాల్గొన్నారు.



కిటకిటలాడిన సౌమ్యనాథ స్వామి ఆలయం
జిల్లాలో ప్రసిద్ధి గాంచిన చారిత్రాత్మక నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామి ఆలయంలో ఆదివారం తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామిని దర్శించుకున్నారు. భక్తులు పెద్ద ఎత్తున దర్శనానికి తరలివచ్చారు. క్యూ లైన్లు భక్తులతో నిండిపోయి ఆలయం కిటకిటలాడింది. భక్తులు స్వామివారిని దర్శించుకుని తమ మొక్కులను తీర్చుకున్నారు.

బ్రహ్మోత్సవాలలో నేడు
ఉత్సవాలలో భాగంగా నాలుగవ రోజు సోమవారం ఉదయం పల్లకిసేవ ,గ్రామోత్సవం, తిరుమంజనం రాత్రికి సింహ వాహనంపై సౌమ్యనాథ స్వామి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు.

షష్టిపూర్తి వయస్సులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-వాల్మీకిపురం : 1980లో పదవ పూర్తి చేసిన విద్యార్థులు షష్టిపూర్తి వయస్సులో కలుసుకొని మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆదివారం స్థానిక పివిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో పూర్వ విద్యార్థులు కలుసుకొని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. 45ఏళ్ల తరువాత అందరూ ఒక చోట కలవడంతో భావోద్వేగపూరిత సంఘటనగా మిగిలిపోయింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మనం ఇక్కడ కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉందని, మనలో కొంత మంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉన్నత ఉద్యోగాల్లో సేవలందిస్తుండగా, మరికొంత మంది ఉపాధ్యాయులు, వైద్యులు, వ్యాపార వేత్తలు, సేవా రంగాల్లో ప్రతిష్టను సాధించారన్నారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.

వైసిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మల్లికార్జున

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : వైసిపి ఎస్‌టి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పట్టణానికి చెందిన ఆవుల మల్లికార్జున నియమి తులయ్యారు. ఈ మేరకు ఆదివారం పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆవుల మల్లికార్జున మాట్లాడుతూ పార్టీకి తాను చేసిన సేవలను గుర్తించి రాష్ట్రస్థాయి పదవి ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తనకు ఈ పదవి అప్పగించిన పార్టీ అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథ్ రెడ్డి, మదనపల్లి వైసీపీ సమన్వయకర్త నిస్సార్ అహ్మద్, ఎస్టీ సెల్ స్టేట్ ప్రెసిడెంట్ భాగ్యలక్ష్మీ, సీనియర్ నాయకులు విఎస్‌రెడ్డి, రఘునాథ్ రెడ్డిలకు సహకరించిన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా చక్రధర్

పీలేరు :వైసిపి విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా పీలేరుకు చెందిన సుంకర చక్రధర్ నియమితులయ్యారు. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆయనకు ఉత్తర్వులు అందాయి. ఈ సందర్భంగా చక్రధర్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర స్థాయిలో కీలక పదవి కట్టబెట్టిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డికి, ఎంపీ మిథున్ రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్ర రెడ్డికి, జిల్లా అధ్యక్షులు ఆకెపాటి అమరనాథ్ రెడ్డికి, రాష్ట్ర ప్రచార విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ హరిప్రసాద్ రెడ్డికి వైఎస్ఆర్ విద్యార్థి భాగం రాష్ట్ర అధ్యక్షులు పానుగంట చైతన్యలకు ధన్యవాదాలు తెలిపారు.

పీలేరు : వైఎస్ఆర్ టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చిన్న ఎల్లప్పను ఆ పార్టీ రాష్ట్ర కమిటీ ప్రకటించింది. ఆదివారం ఆయన పీలేరులో మీడియాతో మాట్లాడుతూ మాజీ సిఎం వైఎస్.జగన్మోహన్ రెడ్డి ఆదేశానుసారం పార్టీ అభివృద్ధితో పాటు కార్మిక, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి వారికి అండగా ఉంటూ రాజీలేని పోరాటాలు చేస్తానని తెలిపారు. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి, పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్మిక వర్గానికి తోడుగా వుంటూ వారిసమస్యల పై ఎలాంటి రాజీలేని పోరాటాలు సాగిస్తూ వారికి న్యాయం జరిగేదాకా తన ఉద్యమాల్ని నడుపుతానని చెప్పారు.


పోలీస్‌స్టేషన్ ఎదుట మృతదేహంతో ఆందోళన చేస్తున్న బంధువులు

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

- ఒంటిమిట్ట పోలీసుస్టేషన్ ఎదుట మృతదేహంతో బంధువుల ఆందోళన
- సిఐ హామీతో విరమణ

ప్రజాశక్తి- ఒంటిమిట్ట
మండల పరిధిలోని మంటపంపల్లి కడప –చెన్నై రైల్వే ట్రాక్‌పై రైలు కిందట పడి లాలయ్య (52) ఆత్మ హత్య చేసుకున్నాడు. దీంతో మృతుడి బంధువులు ఒంటిమిట్ట పోలీస్‌స్టేషన్ ఎదుట ఆదివారం సాయంత్రం మృతదేహంతో ఆందోళన చేపట్టారు. పోలీసుల నిర్లక్ష్యంతోనే తన తండ్రి చనిపోయాడని మృతుడి కుమారుడు వాపోయారు. బంధువుల వివరాలు.. మండలంలోని రాచపల్లి గ్రామానికి చెందిన లాలయ్య ఇంటికి శనివారం రాత్రి సీతారాపురం గ్రామానికి చెందిన ఖాదర్‌బాషా అనే వ్యక్తి వెళ్లాడు. లాలయ్య భార్యతో ఖాదర్‌బాషా అసభ్య ప్రవర్తించడంతో, లాలయ్య కుమారుడు, బంధువులు కలిసి అతన్ని చితకబాదారు. తరువాత పోలీసులకు వారు సమాచారమిచ్చారు. వారు పట్టించుకోకపోగా దుర్భాషలాడడంతో తీవ్ర మనస్థాపానికి గురైన లాలయ్య ఆదివారం ఉదయం 10.30 గంటలకు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల నిర్లక్ష్యంతోనే తన తండ్రి చనిపో యాడని ఒంటిమిట్ట పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. తాము ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. స్పందించిన ఒంటిమిట్ట ఆందోళన స్థలానికి చేరుకుని ఖాదర్‌బాషా, అతని భార్యపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో రాచపల్లికి చెందిన గ్రామస్తులు, బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్ : అర్హులందరికీ ఇల్లు ఇంటి పట్టాలో ఇవ్వాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఉదయ్ కిరణ్, జిల్లా నేత మావులూరి విశ్వనాథలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని దూదేకులపల్లి సరస్వతి నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఇంటి పట్టాలు ఇవ్వడంతో పాటు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదల సొంతింటి కోసం సోమవారం రాయచోటి తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.


జ్యోతి చౌక్ వద్ద నిరసన తెలుపుతున్న బాస్ నాయకులు

తప్పుడు కేసులు బనాయించడం దారుణం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మదనపల్లెలోని బుద్ధుని కొండలోని గౌతమ బుద్ధుడి విగ్రహం ధ్వంసం చేసి అవమానించిన మతోన్మాదులను గుర్తించి వెంటనే అరెస్టు చేయాలని శాంతియుతంగా ధర్నా, నిరసన తెలిపిన బాస్ అధినేత పిటిఎం శివప్రసాద్, బాస్ నాయకులపైన బనాయించిన అక్రమ కేసులను తొలగించాలని బాస్ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం పిటియం, బి.కొత్తకోట మండలాల భారతీయ అంబేడ్కర్ సేన ఆధ్వర్యంలో స్థానిక జ్యోతి చౌక్ వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. మదనపల్లిలో తరచూ బుద్ధుని విగ్రహాలను పగులగొడుతూ కుల, మతాల మధ్య చిచ్చు పెట్టడానికి విద్వేషాలు రగిల్చడానికి ప్రయత్నిస్తున్న మతోన్మాద ఉగ్రవాదులను అరెస్టు చేయడంలో పోలీసులు విఫలమయ్యారని అన్నారు. శాంతియుతంగా నిరసన తెలిపిన బాస్ నాయకులు మీదనే తప్పుడు కేసులు బనాయించడం దారుణమన్నారు. కార్యక్రమంలో బాస్ కేంద్ర కమిటీ సభ్యులు కెవి.రమణ, బాస్ జిల్లా కార్యదర్శి సింగన్న, బాస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సచిన్, బాస్ నియోజకవర్గం అధ్యక్షులు పోతుపేట రామచంద్ర, బాస్ నియోజకవర్గ కార్యదర్శి మాధవ, పి.టి.యం మండలం బాస్ మండల కమిటి అధ్యక్షులు కాట్నగల్లు రమణ, బి.కొత్తకోట మండలం బాస్ మండల కమిటి అధ్యక్షులు పలక వెంకటేష్, పిటియం మండలం బాస్ నాయకులు పులికల్లు నరసింహులు, టైలర్ రమణ పేర్కొన్నారు.


మాట్లాడుతున్న ఆదినారాయణరెడ్డి

పెన్షనర్ల హక్కుల కోసం కలసి పోరాడుదాం

ప్రజాశక్తి-కలికిరి

పెన్షనర్ల హక్కుల సాధనకై కలిసి పోరాడాలని ఎపి రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు వై.ఆదినారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎంఆర్‌సి కార్యాలయంలో రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎనిమిదవ వేతన సిఫారసులో డిఎ, వేతన బెనిఫిట్స్ నుంచి ఫెన్షనర్లను మినహాయించడం పట్ల వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ యోగా చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, వ్యాయామాలు జీవితంలో ఒక భాగం కావాలని తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి మస్తాన్ ఖాన్, విశ్రాంతి ఉపాధ్యాయులు సరోజమ్మ, రమణ నారాయణరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

వైసిపి కార్యకర్తకు 'గడికోట' నివాళి

ప్రజాశక్తి-రామాపురం

మండల పరిధిలోని శుద్ధమల్లతువ్వపల్లిలో ఆదివారం మృతి చెందిన వైసిపి కార్యకర్త మజ్జిగ ముసల్‌రెడ్డి మృత దేహానికి వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పూలమాలవేసి నివాళులర్పిం చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముసల్ రెడ్డి గడికోట కుటుంబానికి విధేయుడిగా ఉండేవాడిని గుర్తు చేసుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులను నాయకులు, కార్య కర్తలతో కలిసి పరామర్శించారు.



మాట్లాడుతున్న ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు శివారెడ్డి

మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలి :ఎస్‌టియు

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

పెరిగిన ధరలకు అనుగుణంగా మధ్యంతర భృతిని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శివారెడ్డి, మధుసూదన పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని విజ్ఞాన్ హైస్కూల్లో జరిగిన ఎస్‌టియు జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ 2023 జూలై నుంచి 12 పిఆర్‌సి అమలు కావలసి ఉండగా ఆలస్యమై నందువలన వెంటనే ఐఆర్ ప్రకటించాలన్నారు. 12వ పిఆర్సి కమిటీని ఏర్పాటు చేయాలని, 12 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు మధ్యంతర భృతి కోరుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించ కపోవడం దారుణ మన్నారు. 11వ పిఆర్‌సి బకాయిలను, డిఎ, సరెండర్ లీవ్ బకాయిలు విడుదల చేయా లని, ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమలుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆదినారాయణరెడ్డి, కడియాల మురళి, రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి, జిల్లా ఆర్థిక కార్యదర్శి వేణుగోపాల్ రెడ్డి, రాష్ట్ర నాయకులు రవీంద్రారెడ్డి,జిల్లా కార్యవర్గ సభ్యులు నరసింహులు, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే సుపరిపాలన :'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మీ సంక్షేమం మా బాధ్యత అంటూ సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా రాజంపేట టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆదివారం కూచివారిపల్లి పంచాయతీ వైబియన్ పల్లిలో ఇంటికి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో కరపత్రాలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబుతోనే రాష్ట్రంలో సుపరిపాలన సాగుతుందని అన్నారు. రాబోయే రోజుల్లో మరింత మెరుగైన పాలన అందించి 2029 ఎన్నికల్లో మరోసారి టిడిపి జెండా ఎగిరేలా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాజంపేట టిడిపి రూరల్ అధ్యక్షుడు గన్నె సుబ్బ నరసయ్య నాయుడు, గ్రామ కమిటీ అధ్యక్షుడు నాగినేని దివాకర్ నాయుడు, బూత్ కన్వీనర్ బాసినేని సుబ్రహ్మణ్యం నాయుడు, యూనిట్ ఇంచార్జ్ ముల్ల గోరి సుబ్రహ్మణ్యం నాయుడు, మాజీ టిడిపి అధ్యక్షులు బాపనయ్య నాయుడు, వెంకటేశ్వర్లు నాయుడు, సుబ్రహ్మణ్యం నాయుడు, కమ్మ సంఘం అధ్యక్షుడు శివ నారాయణ చౌదరి, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ టెక్కో మల్లికార్జున్ నాయుడు, క్లస్టర్ ఇంచార్జ్ కొల్లి రెడ్డియ్య నాయుడు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

అదును దాటుతున్నా..కానరాని చినుకు

- ఊరిస్తూ ఉసూరుమంటున్న వరుణుడు
- ఆందోళన చెందుతున్న రైతులు


దుక్కులు దున్ని వేరుశనగ విత్తడానికి సిద్ధం చేసిన భూములు

ప్రజాశక్తి-కలికిరి

అదును దాటుతున్నా చినుకులు జాడ మాత్రం కాన రాలేదు. రోజు వర్షం వచ్చినట్లే ఊరిస్తూ చివరకు ఊసరమనిపిస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేరుశనగ విత్తనాలు వేయడానికి రైతన్నలు భూమిని సిద్ధం చేసుకున్న తరుణంలో వరుణుడు కరుణించకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జూన్ మొదటి వారంలో మగసల కార్తి ప్రారంభమవుతుంది అప్పుడు వర్షం కురిస్తే మెరుగైన పంట వస్తుందని రైతులు నమ్మకం. మూడు, నాలుగు వారాల్లో ఆరు అర్ధల కార్తీవస్తుందని అప్పుడైనా వర్షం పడితే మోస్తరుగా పంట వచ్చి రైతులకు ఉపశమనం లభిస్తుంది అని ఆశగా ఎదురు చూశారు. అది కూడా పూర్తి అవుతుండడంతో వేరుశనగ వేసినా లాభం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో సుమారు 5420 మంది రైతులు ఉండగా అందులో 2300 మంది రైతులు వేరుశనగ పంటను చేయ డానికి సిద్ధంగా ఉన్నారు. గ్రామాలలో 3192 ఎకరాల్లో వేయడానికి దుక్కులు దున్నుకొని వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. గతంలో 5 వేలు నుంచి 6, 250 ఎకరాల మండలంలో వేరుశనగను పండి స్తున్న రైతన్నలు నేడు సకాలంలో వర్షాలు పడకపోవడం, దున్నకాలకు కూలీలకు అధిక ఖర్చులు, సరైన గిట్టుబాటు ధర లభించకపో వడంతో వేరుశనగ పంట సాగుకు చూపలేదు. దీంతో మండలంలో భారీగా దిగుబడి తగ్గిపోయింది. ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో వేరుశనగ వేసే రైతే లేకుండా పోతారని లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి సంవత్సరం నష్టపోతున్నాం



గత ఐదారు సంవత్సరాల ముందు ఐదు ఎకరాలు వేరుశనగ పంటను పండి స్తున్న మేము వరుస నష్టాలతో పాటు గిట్టుబాటు ధర లేకపోవడంతో సాగునిలిపివేశాం. వర్షాభావ పరిస్థితుల్లో రైతులుతీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. అర ఎకరా వేస్తున్నాం.

-యతేంద్ర యాదవ్ ,వాడవాండ్లపల్లి, గుట్టపాలెం పంచాయతీ

దిగుబడి తక్కువ ఖర్చులు ఎక్కువ



వేరుశనగ సాగుకు దుక్కులు దున్ని రైతులంతా వర్షం కోసం ఎదురు చూస్తు న్నారు. మేఘాలు కమ్ముకున్నా వర్షం కురవడం లేదు. వేరుశనగ సాగుకు ఖర్చు ఎక్కువ, దిగుబడి తక్కువ రావడంతో నష్టాలు పాలవుతున్నాం. తద్వారా అప్పుల పాలు కావడంతో మరొకసారి వేరుశనగ పంటను వేయడానికి ఆసక్తి చూపడం లేదు. వేరుశనగ రైతులకు ప్రభుత్వం మెరుగైన సబ్సిడీ పథకాలు అందించాలి.

-జనార్దన్ గౌడ్, మేడుకుర్తి, కలికిరి

సామరస్యంగా పది కేసులు పరిష్కారం : ఎస్ఐ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

సామరస్యంగా కేసులను పరిష్కరించినట్లు నిమ్మనపల్లి ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం జరిగిన మెగా లోక్ అదాలత్ సందర్భంగా నిమ్మనపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో నమోదైన 10 కేసులను పరిష్కరించడానికి కృషి చేశామని తెలిపారు. కేసులకు సంబంధించిన ఇరువర్గాలకు సమన్యాయం చేసి, ప్రశాంత వాతావరణంలో ఇరు గ్రూపుల అంగీకారంతో వివిధ రకాల పది క్రిమినల్ కేసులను మెగా లోక్ అదాలత్ సందర్భంగా పరిష్కరించినట్లు తెలిపారు. ఆవేశాలతో, పట్టింపులతో, పరువులతో మనం ఏమి సాధించలేమన్నారు. ఆలోచనతో, సర్దుకుపోయే గుణంతో సమస్యలను పరిష్కరించుకోగలమని అన్నారు. చిన్నచిన్న విషయాలకు కూడా కేసులు దాకా వెళ్లడం మంచి పరిణామం కాదని, తప్పొప్పులను గుర్తించి సంయమనం పాటిస్తూ సర్దుకుపోతే ఎంతటి సమస్యనైనా అదుపులో ఉంచుకోగలమని అన్నారు. క్షణిక ఆవేశాలతో జీవితాలను సమస్యల వలయంలోకి నెట్టుకోవద్దని సూచించారు. గ్రామస్థాయిలో పోలీసులు నిరంతరం సామాజిక పరిస్థితులపై, ప్రజల జీవన ప్రమాణాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని పేర్కొన్నారు. కేసుల పరిష్కారంలో క్రియాశీలకంగా వ్యవహరించిన పోలీసు సిబ్బందిని ఆయన అభినందించారు.


కక్షిదారులతో పోలీసులు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పెద్దతిప్పసముద్రం మండలం, మల్లెల గ్రామం, ఉప్పరోళ్ళ పల్లిలో ఆదివారం వైదేహి ఆస్పత్రి సహకారంతో యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని ఫౌండేషన్ వ్యవస్థాపకులు తగాది రాజశేఖర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రసిద్ధిగాంచిన వైద్యులచే ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఎన్ఎం టి వరలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పి బి.వెంకటలక్ష్మి, ఆశాలు ఆర్.మధురావతి, కవిత, జె.వెంకటరమణమ్మ, అనిల్, రెడ్డిభాషా, చంద్ర, కరుణాకర్, స్థానికులు గడ్డపార కిరణ్‌కుమార్ ఉప్పరోళ్లపల్లి భోజనవసతి, మైక్ సెట్ ఏర్పాటు చేశారు. దాదాపుగా 100 మంది రోగులు పరీక్షలు చేసుకోగా 30మందికి వివిధ రకాల జబ్బులతో బాధపడుతున్నట్లు గుర్తించి వారికి ఉచితంగా ఆపరేషన్ నిర్వహిస్తామని డాక్టర్ లోకేష్ భరణి, డాక్టర్ కమాల్, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ అనుపమ్, దిలీప్ తెలిపారు. తమ పంచాయతీలో వైద్య శిబిరం ఏర్పాటు చేసిన వైదేహి ఆస్పత్రి యంగ్‌ఇండియా ఫౌండేషన్ సభ్యులకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు తప్పనిసరి

ప్రజాశక్తి-మదనపల్లె

ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా మదనపల్లి ఏరియా పశువైద్యశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 80 కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పశుసంవర్ధక శాఖ డివిజన్ ఉపసంచాలకులు డాక్టర్ నీరజ, సహాయ సంచాలకులు డాక్టర్ రోహిణి, మండల పశువైద్యాధికారి డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ నేటి రోజుల్లో చాలా మంది కుక్కలను ఎంతో ఇష్టంగా పెంచుతున్నారని, అందువల్ల అవి మానవ జీవితానికి ఎంతో దగ్గరయ్యాయని తెలిపారు. జంతువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి జంతువులకు సుమారు 190 రకాల వ్యాధులు సోకే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. పెంపుడు కుక్కలు ఎప్పటికప్పుడు టీకాలు వేయించకపోతే, అవి ఇతరుల ఆరోగ్యానికి ముప్పుగా మారే అవకాశముందని తెలిపారు.ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 1962 ద్వారా పశువుల వ్యాధులపై సమాచారం పొందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో పశువైద్యులు, పేరా మెడికల్ సిబ్బంది, ఎహెచ్‌ఎలు పాల్గొన్నారు. **కలికిరి :** పెంపుడు జంతువులకు యాంటీ రేబిస్ టీకాలు తప్పనిసరని జిల్లా పశు వైద్యాధికారి గుణశేఖర్ పిళ్లై తెలిపారు. స్థానిక పశు వైద్యశాలలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని గ్రామాల్లో పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేశారు. ఈ సందర్భంగా గుణశేఖర్ పిళ్లై మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ప్రతి ఏటా క్రమం తప్పకుండా పెంపుడు సునకాలకు యాంటీ రేబిస్ టీకాలు వేయించుకోవాల్సిందిగా సూచించారు. వైద్యాధికారులు డాక్టర్ ఉదయ్ కిరణ్, డాక్టర్ అన్వేష్ మాట్లాడుతూ కుక్క కరిచిన వెంటనే తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. కలికిరి ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ వెంకటముని నాయుడు మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు సంక్రమించు రేబిస్, బ్రుసెల్లోసిస్, క్షయ తదితర వ్యాధుల గురించి తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక పశువైద్యాధికారులు డాక్టర్ గిరినాథ్‌రెడ్డి, డాక్టర్ జగన్మోహన్ రెడ్డి, డాక్టర్ కీర్తి, పశువైద్య సహాయకులు పరిమళ, రాజ్‌కు మార్, వంశీ, లతీష్, చలపతి పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** రాజంపేట ఉప సంచాలకులు డాక్టర్ వై.విజయభాస్కర్‌రావు ఆధ్వర్యంలో రాజంపేట ప్రాంతీయ పశు వైద్యశాలలో నిర్వహించారు. పశువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులలో రేబీస్ వ్యాధి ఒకటని వివరించారు. అనంతరం రాజంపేట సహాయ సంచాలకులు డాక్టర్ కె.ప్రతాప్ ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలకు ఉచిత రాబిస్ టీకాలు వేశారు. 76 పెంపుడు కుక్కలకు యాంటీ రాబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరిగినదని డాక్టర్ కే.ప్రతాప్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్.చెర్లోపల్లి పశువైద్యులు కె.భాగ్యవతి, హత్య రాల పశు వైద్యులు వి.వేదవతి రాజంపేట జూనియర్ వెటర్నరీ అధికారి యం.వరదయ్య, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ బి.మణి, హరిబాబు పాల్గొన్నారు. **నందలూరు :** జంతువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరిగిందని పశు వైద్యాధికారి ఈశ్వర్ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు, మనుషుల నుండి జంతువులకు సంక్రమించు వ్యాధులను జూనోటిక్ వ్యాధులుగా పిలుస్తారని తెలిపారు. ఈ వ్యాధులు సుమారు 280 వరకు గుర్తించబడ్డాయని అన్నారు. పెంపుడు కుక్కలకు టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెవిఒ సుగుణ, వి.ఎ.సుదర్శన్ రెడ్డి, ఎహెచ్‌ఎ జాహ్నవి, శివరామ్ పాల్గొన్నారు.


మదనపల్లి: కుక్కలకు టీకా వేస్తున్న డాక్టర్లు నీరజ, రోహిణి

ప్రేమ, త్యాగాలకు ప్రతీక మొహరం

మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి


రామాపురం : మొహరం వేడుకల్లో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-రామాపురం

ప్రేమ త్యాగాలకు ప్రతీకగా మొహరం వేడుకలను హిందూ, ముస్లిములు జరుపుకోవడం అభినందనీయమని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చిట్లూరు గ్రామంలో మొహరం సందర్భంగా రాంప్రసాద్‌రెడ్డి అభిమాని ఖాదర్‌వల్లి విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి మండిపల్లి మాట్లాడుతూ గ్రామాలలో హిందూ ముస్లింలు భాయ్ భాయ్ అంటూ కుల మతాలకు అతీతంగా ఎంతో ఉత్సాహంతో జరుపుకునే పండు గ మోహరం అంటూ తన చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకు న్నారు. ఎస్ఐ వెంకట్ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు పర్య వేక్షించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సురేందర్ రెడ్డి, వెంకట్రా మిరెడ్డి, పట్టాభి రెడ్డి, సహదేవరెడ్డి, దేవదర్శన్ రెడ్డి, ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ కమిటీ సభ్యుడు వెంకటరమణ, శివారెడ్డి పాల్గొన్నారు. **కలకడ :** మొహరం పండుగ వేడుకలను భక్తిశ్రద్ధలతో మండలంలో నిర్వహిం చుకు న్నారు. మండలంలోని కలకడ, ఎర్రకోటపల్లి, పాపిరెడ్డిగారిపల్లి, కోన, నడిమి చర్ల, అగ్రహారం తదితర గ్రామాలలో మొహరం వేడుకలను అంగ రంగ వైభవంగా నిర్వహించినారు. అగ్రహారంలో బంగారు పీరును రంగు రంగుల పూలతో, బాసికములతో ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామాలలో నిర్వహించే పీర్ల పండుగలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ రామాంజనేయులు తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. **పుల్లంపేట :** మండల పరిధిలోని రెడ్డి పల్లె గ్రామపంచాయతీలో మొహర్రం వేడుకలు ఘనంగా పీర్ల పండగ ఉత్సవాలు నిర్వహించారు. ఉత్సవాల్లో గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ముస్లింలు, హిందువులు సోదర భావంతో ఇలాంటి పండుగలు జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని గ్రామ పెద్దలు తెలిపారు. గ్రామంలో ముస్లింలు ఎవరు లేకపోయినా కూడా హిందువుల పీర్ల పండుగను ఆనవాయితీగా నిర్వహిస్తుండడం గమనార్హం.


ఏకలవ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఏరుకలసంఘం నాయకులు

ఘనంగా ఏకలవ్య జయంతి

ప్రజాశక్తి-కలికిరి

స్థానిక ఎస్‌టికాలనీలో ఏకలవ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివాసీ ఎరుకులసేవా సంఘం ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌వర్మ ఆధ్వర్యంలో ఆదివారం ఏకలవ్యని చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకలవ్యని విలు విద్యలో ఎవరూ సాటి రారని అన్నారు. ఆయన చూపిన ధైర్య సాహసాలు గురించి కొనియాడారు. ఆదివాసీలు ప్రతి ఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకొని సమాజంలో ఉన్నతంగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో మహిళా నాయకురాళ్లు జగన్నాథంగౌరి, జగన్నాథ, ఎం.సౌజన్న, బండి రెడ్డెప్ప, దాసరి శ్రీనివాసులు, క్రాంతికుమార్, రాజా, నాగయ్య పాల్గొన్నారు.


నియామకపత్రాన్ని అందుకుంటున్న గంగాధర్

మైఫోర్స్ ఇన్‌ఛార్జిగా గంగాధర్

ప్రజాశక్తి-వాల్మీకిపురం

మైఫోర్స్ పీలేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా మైఫోర్స్ గంగాధర్‌ని నియమించినట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మైఫోర్స్ మహేష్ అన్నారు. ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మైఫోర్స్ మహేష్ నుంచి నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ మైఫోర్స్ ఎప్పుడూ ప్రజలకు సేవ చేసే ఉద్దేశ్యంతో ముందుకు వెళుతుందన్నారు. త్వరలోనే నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మండల కమిటీలను నియమిస్తామని చెప్పారు. అనంతరం మైఫోర్స్ మహేష్ మాట్లాడుతూ పవన్ ప్లాంటేషన్ డ్రైవ్ పేరుతో పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాష్ట్రంలో 51శాతం గ్రీనరీని పెంచేందుకు నియోజకవర్గ వ్యాప్తంగా పదివేల చెట్లను నాటే కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. అలాగే యువత క్రీడలకు దూరం అయ్యి మత్తుకి బానిస అవుతున్నారని, మత్తు మహమ్మారి నుంచి యువతను కాపాడేందుకు వివిధ రకాల క్రీడా పోటీలను నిర్వహిస్తామని చెప్పారు. తల్లిదండ్రులు లేని ఆడపిల్లలకు మైఫోర్స్ ఎప్పుడు అండగా ఉంటుందని అన్నారు. మైఫోర్స్ విద్య అభయం పేరుతో తల్లిదండ్రులు లేని ఆడపిల్లల బాధ్యత మైఫోర్స్ తీసుకొని, వారిని చదివించడంతో పాటు వారి బాగోగులను చూసుకుంటుందని తెలిపారు. కుల,మత, ప్రాంత బేదాలు లేని సమాజమే మైఫోర్స్ లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు హరి పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - పీలేరు

గురుపౌర్ణమి సందర్భంగా అరుణాచలం వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు పీలేరు ఆర్‌టిసి డిపో మేనేజర్ బి.నిర్మల ఆదివారం తెలిపారు. గురు పౌర్ణమిని పురస్కరించుకుని ఈ నెల10న పీలేరు నుంచి తిరువణ్ణామల్లె (అరుణాచలం)కు ప్రత్యేక ఆర్‌టిసి బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు డిఎం అన్నారు. భక్తుల రద్దీని బట్టి ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులు నడుపుతామని తెలిపారు. దర్శనం తోపాటు గిరి ప్రదక్షిణకు అనువుగా బస్సులు నడుపుతున్నామని, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు సెల్ నెంబర్ 9441774743 సంప్రదించాలని కోరారు.


మాట్లాడుతున్న డిఎం నిర్మల

క్రైం కార్నర్

ట్రాక్టర్ ఢీకొని అన్నదమ్ములకు గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ట్రాక్టర్ ఢీకొని అన్నదమ్ములు గాయపడిన సంఘటన ఆదివారం చౌడేపల్లిలో జరిగింది. బాధితుల కథనం మేరకు.. నిమ్మనపల్లి మండలం, గుండ్లబురుజుకు చెందిన అన్న దమ్ములు రాజేష్, వినోద్ తొలి ఏకాదశి పండుగ సందర్భంగా చౌడేపల్లిలో ఉన్న అక్కను చూసేందుకు ద్విచక్ర వాహనంలో వెళ్లారు. సాయంత్రం తిరిగి అదే వాహనంలో స్వగ్రామానికి బయల్దేరారు. మార్గ మధ్యంలోని బోయకొండ ఆర్చివద్ద వీరిని ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో అన్నదమ్ము లిద్దరూ గాయపడడంతో గమనించిన స్థానికులు బాధితులను 108లో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. చౌడేపల్లె పోలీసులు విచారిస్తున్నారు.